ఆస్తిపన్ను చెల్లింపుదారులకు నోటీసులు జారీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులకు డిమాండ్ నోటీసులను జారీ చేస్తున్నట్లు సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్ నగర్, శాస్త్రిపురం డివిజన్లలో 54 వేలకు పైగా ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఉన్నారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను డిమాండ్ నోటీసులను ప్రస్తుతం సిబ్బంది పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కొందరు గత నెలలో ప్రత్యేక డిస్కౌంట్ పొంది ఆస్తిపన్నును చెల్లించారన్నారు. ప్రతి నెల ఆస్తిపన్నుపై అపరాధ రుసుం విధిస్తున్నట్లు తెలిపారు. ఈ అపరాధ రుసుం నుంచి తప్పించుకోవడానికి ఆస్తిపన్నును చెల్లించాలన్నారు. ఆస్తిపన్ను చెల్లింపుతోనే సర్కిల్ అభివృద్ధి సాగుతుందన్నారు. 5 శాతం రాయితీకి సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రస్తుతం జారీ చేస్తున్న డిమాండ్ నోటీసులను స్వీకరించిన వారు ఆన్‌లైన్‌లో కానీ సర్కిల్ కార్యాలయంలో కానీ లేదా బిల్లు కలెక్టర్‌కు ఆస్తిపన్నును చెల్లించాలన్నారు.

మేరు సంఘం ఎన్నికలకు నామినేషన్లు షురూ

చార్మినార్: జూన్ 30న జరుగనున్న తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం ఎన్నికలను పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లను తీసుకోనున్నామని సంబంధిత ఎన్నికల అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ మూడు రోజుల వరకు కొనసాగుతుందన్నారు. జూన్ 13 నుంచి 16 వరకు నామినేషన్ల పరిశీలన, 17న ఉపసంహరణ, 18న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నామన్నారు. జూన్ 30న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని.. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు.

కాలువ పనులు పూర్తయితేనే..



వైశాలీనగర్ నుంచి ఈర్ల చెరువు వరకు మురుగు నీటి కాలువ పనులు అసంపూర్తిగా ఉన్న దృశ్యం

సాఫీగా రాకపోకలు..

- భారీ వర్షాలు కురిస్తే వైశాలీనగర్‌కు ప్రయాణాలు బంద్
- నత్తనడకన మురుగునీటి కాలువ పనులు
- వైశాలీనగర్–ఈర్ల చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలి

హఫీజ్‌పేట్: చెరువులలో మురుగునీరు కలవకుండా ప్రత్యేకంగా చేపట్టిన మురుగునీటి కాలువ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలీనగర్ నుంచి ఈర్ల చెరువు మీదుగా మదీనాగూడ వైపు సాగాల్సిన కాలువ పనులు ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. పూర్తి కాకపోవడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట నుంచి గురునాథం చెరువు వరకు 70 శాతం పనులు పూర్తికాగా, మదీనాగూడ ఈర్ల చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ వరకు మురుగు నీటి కాలువల నిర్మాణం పూర్తి అయ్యాయి. కానీ వైశాలీనగర్ నుంచి ఈర్ల చెరువు వరకు చేపట్టిన పనులు పూర్తికాక పోవడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

- సుమారు రూ.7.41 కోట్లతో మురుగునీటి మళ్లింపు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు
- వర్షాకాలం ముంచుకొస్తున్న సందర్భంగా కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- కాలువ ఇరువైపులా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి
- మార్తాండనగర్, ప్రేమ్‌నగర్, మై హోం మంగళ నుంచి మురుగు నీరు ఈర్ల చెరువులోకి వస్తుంది. ఇక చిన్నపాటి వర్షం వస్తే చాలు రైల్వే అండర్ బ్రిడ్జి, వైశాలీనగర్‌లోకి మురుగునీరు చేరుతున్నాయి.
- దీంతో దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.
- భారీ వరద వస్తే వైశాలీనగర్‌కు రాకపోకలు నిలిచిపోతాయని ఈ ఏడాది భారీ వర్షాలు కురుస్తాయని సూచనల మేరకు అధికారులు తొందరగా పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



వైశాలీనగర్ వద్ద చేపట్టిన మురుగు నీటి కాలువ మళ్లింపు పనుల్లో ఆలస్యం జరుగుతోంది. వర్షాకాలం సమీపిస్తుండడంతో కాలువ పనులు పూర్తి చేయాలి.

– కుమార్, స్థానికుడు

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం



మురుగు నీటి కాలువ మళ్లింపు పనులు కొంత మేర మిగిలి ఉన్నాయి. ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తున్నా. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను.

– ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ





వైశాలీనగర్ వద్ద మురుగు నీటి కాలువలో చెత్తాచెదారం, విరిగిన చెట్ల కొమ్మలు



సూచికబోర్డులు లేకుండా వైశాలినగర్ కాలువ బ్రిడ్జి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఏజీ కాలనీ ఫీడర్ పరిధిలోని సంజీవనిహిల్స్, నలందనగర్, శ్రీమల్లేనగర్, ఏజీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు, హైదర్‌గూడ ఫీడర్ పరిధిలోని నలందనగర్, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, డాక్టర్ కాలనీ, శ్రీమల్లే నగర్, లోటస్ స్కూల్, ప్లేసంట్ పార్కు, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, అత్తాపూర్ ఫీడర్ పరిధిలోని ఈశ్వర్ థియేటర్, హైదర్‌గూడ విలేజ్, గాంధీ విగ్రహం, కంటారెడ్డినగర్, రాధాకృష్ణనగర్, అంబియస్స్ ఫోర్ట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు, జనప్రియ ఏబీసీ ఫీడర్ పరిధిలోని కేశవ్‌నగర్, కృష్ణానగర్, శివనగర్, మోర్ సూపర్ మార్కెట్, గుమ్మకొండ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నార్సింగిలో...

మణికొండ: నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ఫీడర్ల మరమ్మతులు, విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపడుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు బృందావన్‌కాలనీ, నమన దాబా, విజేత సూపర్ మార్కెట్, గండిపేట మెయిన్‌రోడ్, విష్లింగ్ వుడ్స్ విల్లాల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు లెజెండ్ చిమ్నీస్ విల్లాలు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇస్తానా ఊర్జిత విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అలకాపూర్‌లో...

మణికొండ: పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల మరమ్మతులు, విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపడుతున్నందున బుధవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 22 నుంచి 30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 14 నుంచి 22 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అలకాపూర్ టౌన్ షిప్ రోడ్డు నెంబర్ 1 నుంచి 13 వరకు సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీనిని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు



భక్తులను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యారాధన, గోష్టి , నృసింహాయిష్టి కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పల్లకీ సేవలో భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు సౌమిత్రి నారాయణ భక్తులకు ఆశీర్వదించారు. అనంతరం భక్తలకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

నిల్వ పదార్థాలతో ప్రజల ఆరోగ్యాలను చెడగొట్టొద్దు

నార్సింగి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



హోటల్ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

మణికొండ: హోటల్‌లు, టిఫిన్ సెంటర్లలో ప్రజలకు తాజా కూరగాయలు, నిత్యావసర వస్తువులను మాత్రమే వాడాలని, ఫ్రిడ్జ్‌లలో చాలా రోజులపాటు నిల్వ చేసి మరుసటి రోజు వాడి ప్రజల ఆరోగ్యాలను చెడగొట్టదని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నార్సింగి, మంచిరేవులలో ఉన్న హోటల్స్, టిఫిన్‌సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో పేరున్న పెద్ద హోటల్‌లలో అక్రమాలు బయటకు వస్తుండటంతో వాటిపై కేసుల నమోదు, సీజ్ చేయటాలు జరుగుతున్నాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని హోటల్‌లను అకస్మికంగా తనిఖీలు చేస్తామని, అప్పుడు ఎవరి వద్దనైనా నిలువ వస్తువులు కనిపించినా, ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్లు కనిపిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. 120 మైక్రాన్ కన్నా తక్కువ ఉన్న కవర్లను వాడొద్దన్నారు. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను మాత్రమే దేవుడు లాంటి కస్టమర్‌లకు అందించాల్సిన బాధ్యత వాటి నిర్వాహకులపై ఉందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి...

రాబోయే వర్షాకాలంలో రోడ్లపై నీరు, చెత్త చేరి వరద నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని వార్డులలో ముందస్తు చర్యలు చేపట్టాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ సూపర్ వైజర్లు, జవాన్‌లను ఆదేశించారు. మంగళవారం వారితో సమావేశం నిర్వహించి మ్యాన్‌హోల్ వద్ద మట్టి చేరటం, రోడ్ల పక్కన చెత్త నిలువ ఉండటం, ఫుట్‌పాత్‌లపై మట్టి కుప్పల వెంటనే తొలగించాలన్నారు. వర్షాలకు కూలిపోయే గృహాలు ఉంటే ముందస్తు చర్యలు తీసుకుని ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. అనంతరం అన్ని వార్డు కార్యాలయాల్లో సూపర్‌వైజర్లు, జవాన్‌లు శానిటేషన్ సిబ్బందికి అవే సూచనలు చేసి వర్షాకాలం ముందస్తు చర్యలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం, ఎకోలాస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ స్వేత తదితరులు పాల్గొన్నారు.

గండిపేట చెరువులో మునిగి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు ముబిన్

మణికొండ: కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుదామని గండిపేట చెరువుకు వచ్చిన ఓ బాలుడు ఈతరాక చెరువులోకి దిగడంతో నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లంగర్ హౌస్‌కు చెందిన సయ్యద్ ముబిన్ (15) సోమవారం మధ్యాహ్నం తన కుటుంబ సభ్యులతో గండిపేట చెరువు చూసేందుకని ఖానాపూర్ వద్దకు వచ్చారు. తోటి పిల్లలతో కలిసి చెరువులో దిగిన ముబిన్‌కు ఈత రాకపోవటంతో నీటిలో మునిగిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం సాయంత్రం ఎంత వెతికినా ఫలితం దక్కలేదు. మంగళవారం గజ ఈతగాళ్లను రప్పించి ఓ బోటు సహాయంతో వెతికించటంతో సాయంత్రం బాలుడి మృతదేహం లభించింది. పోలీసులు మునిన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ముబిన్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వరల్డ్ హైపర్ టెన్షన్ డే

గోల్కొండ: వరల్డ్ హైపర్ టెన్షన్ డే మెహిదీపట్నం నానల్‌నగర్‌లోని ప్రీమియర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నానల్‌నగర్‌లోని ఆసుపత్రి నుంచి లక్ష్మీనగర్ చౌరస్తా వరకు జరిగిన ఈ ర్యాలీని ఆసుపత్రికి చెందిన సిద్ధార్థ మరడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ఆశయమన్నారు. ఆరోగ్యకరమైన రేపటి కోసం క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ రక్తపోటు పరీక్షలు చేసుకుంటూ ఉండాలని సూచించారు. గ్లెన్‌మార్క్ ఫార్మా ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఆసుపత్రి జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ అడ్మిషన్లలో అవకతవకలను సరిచేయాలి



ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

విజయనగర్‌కాలనీ: ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ అడ్మిషన్లలో అవకతవకలతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ సెవెళ్ల, కోశాధికారి యోగరాజ్ సింగ్, ఉపాధ్యక్షులు మహేష్ నామాని, సంతోష్, తరుణ్ పాల్గొన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం



మురుగు సమస్యను పరిష్కరింపజేస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

అత్తాపూర్: పెద్దతాళ్లకుంట పార్కులోకి 15 రోజుల నుంచి మురుగునీరు రావడంతో పార్కుకు వచ్చే ప్రజలు మురుగునీటి వాసన భరించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పార్కుకు యోగా చేసుకునేందుకు వచ్చిన వారు కూడా ఇబ్బందులకు గురికావటంతో విషయాన్ని అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆమె వెంటనే గమనించి జీహెచ్ఎంసీ అధికారులకు అలాగే హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు హుటాహుటినా అక్కడకు చేరుకోగా వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా కాంతరెడ్డి కుంట పార్కు, మేధా రిడ్జెస్ అపార్ట్‌మెంట్‌లో కూడా డ్రైనేజీ సమస్యతో మురుకినీరు చెరువును తలపిస్తుండటంతో అపార్ట్‌మెంట్‌వాసుల విజ్ఞప్తి మేరకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్, పి. లక్ష్మారెడ్డి, రాజేంద్రనగర్ శివరేజ్ బోర్డు జనరల్ మేనేజర్ శ్యాంసుందర్‌నాయక్, డీజీఎం జమీల్, శ్రావ్యరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ జావేద్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..

రెండు రోజుల్లో పాఠశాలలకు తరలిస్తాం : ఎంఈఓ రాంరెడ్డి

రాజేంద్రనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేపడుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలు మంగళవారం రాజేంద్రనగర్‌కు చేరాయి. రాజేంద్రనగర్ ఎంఈఓ కార్యాలయానికి పాఠ్య పుస్తకాలను అధికారులు ఉదయం తరలించారు. కార్యాలయం గోదాంలో ఈ పాఠ్య పుస్తకాలను భద్రపరిచారు. రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ఈ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. వచ్చే నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో 15 రోజులకు ముందుగానే పాఠ్య పుస్తకాలు మండల కార్యాలయానికి చేరాయి. వీటిని రెండు రోజుల అనంతరం పాఠశాలల వారీగా పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందజేసే ఉచిత పుస్తకాలను అందిస్తామన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



గ్యారిసన్ సెంటర్‌లో సైనికులకు ట్రాఫిక్ అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోల్కొండ: వాహనదారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. మంగళవారం మెహిదీపట్నం గ్యారిసన్ సెంటర్‌లో సైనికులకు ట్రాఫిక్ నిబంధనలు, వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 13వ డోగ్రా రెజిమెంట్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ జి.శంకర్ మాట్లాడుతూ.. వాహనచోదకులు వాహనాలు నడిపే సమయంలో తమ వెంట వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. అంతేకాకుండా హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, మైనర్లు వాహనం నడిపితే ప్రమాదం ఉంటుందని అన్నారు. దేశ రక్షణ కోసం సదా విధులు నిర్వహించే సైనికులు రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో అన్ని జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురు డోగ్రా రెజిమెంట్ సైనికులు ట్రాఫిక్ నిబంధనలపై తమకు ఉన్న అనుమానాలను ఏసీపీని అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డోగ్రా రెజిమెంట్ లెఫ్టినెంట్ కర్నల్ అనిమేష్‌రావత్, మేజర్ అజయ్, లెఫ్టినెంట్ గణేష్‌చౌదరితో పాటు ఆసిఫ్ నగర్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి సారూ..

గోల్కొండ: జీతాలు ఇప్పించాలంటూ కార్వాన్ నియోకవర్గానికి చెందిన శానిటేషన్ కార్మికులు ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఎమ్మెల్యేను టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న తమకు అధికారులు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని వారు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. జీతలు లేకపోవటంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్వాన్ ఏఎంహెచ్ఓ డాక్టర్ అ నురాధను జీతం అడిగితే బల్దియా డిప్యూటీ కమిషనర్‌ను కలవాలని బుకాయిస్తున్నారని వారు పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మీకు జీతాలు వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని అన్నారు. ఏఎంహెచ్ఓతోనే కాకుండా ఇతర అధికారులతో సైతం మాట్లాడి మీకు వెంటనే జీతాలు అందేలా తనవంతు ప్రయత్నం చేస్తానని ఎ మ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఆక్రమణలను తొలగించండి

మున్సిపల్ కమిషనర్‌కు పంచవటి వాసుల వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచవటి కాలనీవాసులు

మణికొండ: తమ కాలనీలోని రోడ్లు, పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటితో పాటు కాలనీలో అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని పంచవటి కాలనీ వాసులు కాలనీలో పర్యటించిన మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు కాలనీలో పలు రోడ్లు గుంతలమయం అయ్యాయని, వాటికి మరమ్మతులు చేయించాలని బుల్కాపూర్ నాలాలో పూడిక తీయించాలని సూచించారు. రాబోయే వర్షాకాలంలో కాలనీ ముంపునకు గురికాకుండా బుల్కాపూర్ నాలా, పండెన్‌వాగులలోని పూడికను తొలగించాలన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీపతిరెడ్డి, వైజీకే మూర్తి, రామసుబ్బారెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తుల్జా భవానీ రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



దేవాలయంలో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువులో శ్రీ తుల్జా భవానీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో 5వ వార్షికోత్సవం, శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పంచమ వార్షికోత్సవంతో పాటు శ్రీ ఆంజనేయ స్వామి వారి 22 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉదయం 6 గంటలకు మూలవిరాట్టు అయిన శ్రీ రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ తల్లి, శ్రీ సిద్ధి వినాయక స్వామి, శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వార్లకు దివ్య అభిషేకం, అలంకరణలతోపాటు ఉదయం 10 గంటలకు గణపతి రుద్రయాగం, 11 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ, 12.30కు మహా నివేదన, మంగళహారతి, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయ చైర్మన్ కఠారె రాంనరేష్, కార్యదర్శి పీసరి వినయ్‌రెడ్డి, కోషాధికారి చరాయి రమేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో పూలపల్లి కృష్ణారెడ్డి, దప్పు నవీన్, విజయ గణపతి దేవాలయ కమిటీ సభ్యులు, కన్యకాపరమేశ్వరి ఆలయం సభ్యులు, ఇండస్ వ్యాలీ కాలనీసభ్యులు, లిబ్‌డం విల్లా కాలనీ సభ్యులు, సంజయ్ గాంధీనగర్ కాలనీ వాసులు తదితరు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం రావడం ఖాయం



గిడుగు రుద్రరాజును సన్మానిస్తున్న కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: కేంద్రంలో ఈసారి ఇండియా కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని ఉమ్మడి తెలుగు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. మంగళవారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. పదేళ్లు శ్రీరాముడి పేరుతో దేశాన్ని పాలించి దేశ ఆర్థిక వ్యవస్థను బీజేపీ భ్రష్టుపట్టించిందన్నారు. అంతేకాకుండా కులాల చిచ్చుపెడుతూ విభజించి పాలించు అనే బ్రిటిష్ సూక్తిని పాటించారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు మళ్లీ ఆదరిస్తున్నారని కర్ణాటక, తెలంగాణలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం దీనికి నిదర్శనమన్నారు. ఆయనను కలిసిన వారిలో ఎం.రఘుపాల్‌రెడ్డి, వెంకన్న, బాబు, వెంకటకృష్ణ తదితరులున్నారు.

మెహిదీపట్నం ఆర్టీసీ డిపోలో ‘గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0 ’



కార్యక్రమంలో బీవీ కృష్ణమూర్తి తదితరులు

గోల్కొండ: ఆర్టీసీ సిబ్బంది పూర్తి ఫిట్‌నెస్‌తో ఆరోగ్య సమస్యలు ఏమి లేకుండా ఉండాలన్నదే తమ సంస్థ వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆశయమని ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ బీవీ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థకు చెందిన ప్రతి ఉద్యోగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సంస్థ ఆశయమని ఆయన అన్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ వారు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0ను ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా సంస్థకు చెందిన ప్రతి ఉద్యోగికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు సైతం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. డాక్టర్లు ఇచ్చిన రిపోర్ట్స్ ప్రకారం ప్రత్యేక వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు చేసి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ లాభాల బాటలో పయనించడమేకాకుండా సిబ్బంది కారణంగా బస్సు ప్రమాదాలు నివారించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నమృత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.